నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : ప్రశాంత్ నగర్ ఫీడర్ పరిధిలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి ఏఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మయూరి నగర్, టెంపుల్ కాంప్లెక్స్, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్‌ఎల్ సిటీ రోడ్డు, వృద్ధాశ్రమం ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 ప్రాంతాల్లో 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

చింతల్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను పరిష్కరించేందుకు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు న్యూ బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ పరిధి శంకర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో సీతారాంపురం, గణేష్ కాలనీ, మర్రి రాంరెడ్డి కాలనీ, యాదవ బస్తీ, ఓల్డ్ కల్యాణి థియేటర్ లైన్, బృందావన్ కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలనీ, ఐస్ ఫ్యాక్టరీ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు చిన్న తోకట్ట సబ్ స్టేషన్ లిమిట్స్ సెంట్రల్ ఎక్సైజ్ ఫీడర్ పరిధిలో హస్మత్ పేట్, ముస్లిం బస్తీ, లైన్ స్టోన్ కాలనీ, అబ్రార్ నగర్, త్రినిటీ టవర్స్, ఎస్ఎస్ రెసిడెన్సీ, సూర్య ఎన్‌క్లేవ్, అపోజిట్ జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్, సత్య అక్రేడ్, ఎమరాల్డ్ లేక్ రెసిడెంట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కాలనీ వాసులు

జగద్గిరిగుట్ట: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పున ప్రతిష్ఠాపన అనంతరం నాలుగు సంవత్సరాలుగా ప్రతి మంగళవారం ఇక్కడ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రోడ్డుపై చెత్త వేయకండి



అపురూప కాలనీ రోడ్డులో వేసిన చెత్త

జీడిమెట్ల: కాలనీల్లో చెత్త సేకరించేందుకు మున్సిపల్ సిబ్బంది ఇళ్ల వద్దకు వస్తున్నప్పటికీ కొంతమంది రోడ్లపై చెత్త వేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో తీసుకువచ్చి రోడ్లపై పడేస్తున్నారు. చెత్త వేయకుండా సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ చెత్త వేసే వారిలో మార్పు రావడం లేదు. అపురూప కాలనీ చివర ఉన్న రోడ్డులో ఉదయం వేళల్లో చాలా మంది రోడ్లపై చెత్తను వేసి వెళ్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘం వారు సైతం పట్టించుకుని రోడ్డుపై చెత్తవేయకుండా చూడాలని శానిటేషన్ సిబ్బంది కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



చెక్కు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మహంకాళి కృష్ణకు రూ.57 వేలు, తడకల మంజులకు రూ.60 వేలు, క్లెం రవీందర్ గౌడ్‌కు రూ.30 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ యాదవ్, నగేష్, మధుసూదన్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

34 మందితో రైతుభరోసా జాబితా

మండలంలో 294 ఎకరాలకు 53 ఎకరాల్లో పంట సాగు

సుభాష్‌నగర్: సాగుల భూముల జాబితాను సిద్ధం చేశామని కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలో గాజులరామారం, సూరారం, కుత్బుల్లాపూర్, పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, నందానగర్ గ్రామాలకు గాను 294.34 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా. అందులో తమ సిబ్బంది సర్వే ఆధారంగా 34 మంది రైతులు 53.03 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా ఎకరాలలో చాలావరకు నాలా అనుమతి తీసుకోవడం, కమర్షియల్‌పర్పస్ ఉపయోగించడం వల్ల కేవలం 53.03 ఎకరాలలో మాత్రమే సాగు చేస్తున్నారని తెలిపారు.

అడ్డా లేక కార్మికుల అవస్థలు!

- శాశ్వత అడ్డా కేటాయించాలని వేడుకోలు



జగద్గిరిగుట్ట బస్టాప్‌లో భవన నిర్మాణ కార్మికులు

జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ కార్మికులు శాశ్వత అడ్డా కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో కూర్చోడానికి కూడా వసతులు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. అడ్డా లేక జగద్గిరిగుట్ట బస్టాప్, శ్రీనివాస్ నగర్‌లలో రోడ్లపై నిలబడుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా దుకాణ సముదాయాలు పెరగడం వీరికి కష్టంగా మారింది. బస్టాప్‌లో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండడం, వీరు కూర్చోడానికి తగిన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. యూనియన్ సభ్యులు అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు కూడా అందజేశారు. 2 నెలల క్రితం లేబర్ జాయింట్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు తమ గోడును విన్నవించారు. దీనికి స్పందించిన అధికారులు.. సమస్యకు పరిష్కారం చూపాలని తహసీల్దార్‌కు కూడా ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. హెచ్ఎంటీలోని రాంకీ ఎస్‌సీటీపీ ప్లాంట్ పక్కనే ఉండే స్థలంలో తమకు కనీస సౌకర్యాలతోనైనా అడ్డాను ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

శాశ్వత అడ్డాను ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం కార్మికులు ఉండే ప్రాంతాల్లో నిత్యం ఆటోలు, బస్సులు, దుకాణాదారులతో రద్దీగా ఉంటుంది. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. శాశ్వతంగా ఓ కార్మికుల అడ్డాను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– యాదగిరి, భవన నిర్మాణ కార్మికుడు.

తహసీల్దార్ స్పందించినా..



అడ్డా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ స్పందించినా పరిష్కారం లభించలేదు. ఎన్నో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కార్మికుల అడ్డా కోసం స్థలం దొరకకపోవడం విడ్డూరం.

– ఉమా మహేష్, భవన నిర్మాణ కార్మికుల గౌరవ అధ్యక్షులు.

ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే వివేకానంద



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. బాచుపల్లి డివిజన్ 11, 15, 17, 19, 20లలో పలు కాలనీలలో రూ.4.19 కోట్లతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పదేళ్ల కాలంలో నిజాంపేట్ కార్పొరేషన్‌ను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు ఆగం రాజు, కాసాని సుధాకర్, గజుల సుజాత, రాఘవేందర్‌రావు, బాలాజీ నాయక్, జ్యోతి, కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జోయతి సతీష్, సలీం, అర్పిత, సాంబశివారెడ్డి, స్వామి, అజయ్‌చౌదరి, ప్రదీప్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి, హెచ్‌ఎండీఏ అధికారుల పర్యటన

చింతల్: కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ విస్తరణ కోసం మంగళవారం వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ అధికారులు పర్యటించారు. జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్ స్కూల్ వెనుక భాగంలో ఉన్న యాదిరెడ్డి బండ, రంగారెడ్డి బండ, ఉడ్స్ కాలనీ తదితర గేటెడ్ కమ్యూనిటీలతోపాటు మరిన్ని కాలనీలకు భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ లేదు. దీంతో అక్కడి నివాసితులు పలు మార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించారు. దీంతో జలమండలి అధికారులు ప్రణాళికలు రూపొందించి యాదిరెడ్డి బండ నుంచి సెయింట్ ఆన్ స్కూల్ ప్రధాన రోడ్డు వరకు 600 ఎంఎం డయా గల పైపులైన్ తో పాటు కొంతమేర 400 ఎంఎం, మరి కొంతమేర 300 ఎంఎం డయాతో కలిపి సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ నూతన పైపులైన్ నిధులు సమకూర్చారు. గతంలో పైపులైన్ వేసేందుకు జలమండలి అధికారులు స్థల పరిశీలన చేయగా.. సెయింట్ ఆన్ స్కూల్ వెనుక భాగంలో ఉన్న హెచ్ఎండీఏ స్థలాన్ని జర్నలిస్టు సంఘాలకు కేటాయించిన నేపథ్యంలో హెచ్ఎండీఏ అధికారులు, పలువురు జర్నలిస్టు నేతలు ఈ స్థలంలో లేఅవుట్ వేసిన తర్వాత పైపులైన్ వేయాలని జలమండలి అధికారులకు దరఖాస్తులు పంపారు. ఇంతలోనే జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కోర్టు రద్దు చేయడంతో మరల పైపులైన్ వేసేందుకు జలమండలి అధికారులు సమాయత్తమయ్యారు. ఈ క్రమంలో మంగళవారం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ అశోక్, చింతల్ డీజీఎం రాజేష్, జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ అనూష, సుచిత్ర మేనేజర్ శివప్రసాద్, హెచ్ఎండీఏ ఆర్ఐ దివ్యశ్రీ పైపులైన్ వేసే ప్రాంతంలో పర్యటించారు. జలమండలి నుంచి హెచ్ఎండీఏకు నివేదిక సమర్పించాలని కోరారు.

నేడు జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

జీడిమెట్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సూరారంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో జీహెచ్ఎంసీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ముట్టడికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి దేవదానం, నాయకులు పసుల అంజయ్య, మున్సిపల్ కార్మికులు కౌసల్య, రాములమ్మ, పెంటమ్మ, ధనమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లో ముట్టడి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కార్మికులను ప్రభుత్వాలు పర్మినెంట్ చేయడం లేదని, దీంతో వారికి ఉద్యోగ భద్రత కరువైందన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు చిల్డ్రన్స్ అనాథాశ్రమం ప్రారంభం

జగద్గిరిగుట్ట: రింగ్‌బస్తీలోని హోరెబ్ చిల్డ్రన్స్ అనాథాశ్రమాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మధుకర్ బైల్ల, సోను మధుకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

చిత్తారమ్మ సన్నిధిలో కుంకుమార్చనలు

సుభాష్‌నగర్: గాజుల రామారం చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు కుంకుమార్చన జరుగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చుట్టు పక్కల నుంచి భక్తులు తరలివస్తు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

దుండిగల్: ఎలాంటి టెండర్లు వేయకుండానే మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దుండిగల్‌లో మంగళవారం కాంగ్రెస్ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఎటువంటి టెండర్లు వేయకుండా, వర్క్ ఆర్డర్ లేకుండానే స్థానిక కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. మైనారిటీలను మభ్యపెట్టి ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్, ఏఈల దృష్టికి తీసుకెళ్లగా.. సదరు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కావలి గణేష్, సీనియర్ నాయకులు లద్దీపిర్ల నర్సింగరావు గౌడ్, అమరం ముత్యంరెడ్డి, ఆకుల ప్రేమకుమార్ పటేల్, కావాలి శశికుమార్, పండగ శ్రీశైలం, సిరగల్ల బాబు, ఏలూరి చిన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



బోరు మోటారును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డి.పోచంపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో నీటి ఎద్దడి సమస్యపై స్థానిక కౌన్సిలర్ నవితారెడ్డికి విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె బోరు మోటారును ఏర్పాటు చేయించగా.. మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ సముదాయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాముగౌడ్, జక్కుల మల్లేశ్ యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

పరికి చెరువులో నిర్మాణాలు నిలిపి వేయాలి

జగద్గిరిగుట్ట: పరికి చెరువులో నిర్మాణాలు నిలిపి వేయాలని ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.. పరికి చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ హద్దులు, ప్రభుత్వ సర్వే నంబర్లను, గతంలో ఉన్న ఫొటోలు తదితర వివరాలను అందజేశామన్నారు. అదే విధంగా పరికి చెరువును, గుట్ట పై ఉన్న భూములను హైడ్రా కమిషనర్ పరిశీలించిన క్రమంలో నూతంగా బేస్మెంట్ నిర్మాణం జరిగిందని చెప్పామని, అక్రమమని తెలితే కూల్చివేస్తామని కమిషనర్ తెలిపారన్నారు. పర్యటన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. బుధవారం అందరితో సమావేశం నిర్వహించి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, వెంకటేష్, సామెల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో రోడ్డు రోలర్ దొంగలు?



జీడిమెట్ల స్టేషన్ వద్ద డీసీఎంలో ఉన్న రోడ్డు రోలర్

జీడిమెట్ల: సంవత్సర కాలంగా రోడ్డు రోలర్ వాహనాలను ఎత్తుకెళ్తున్న వారిని జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి బహదూర్‌పల్లిలో ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ.20 లక్షల విలువ చేసే రోడ్డు రోలర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లడాన్ని స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సదరు వాహనాన్ని చేజింగ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనంలో మొత్తం పది మంది సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి రోడ్డు రోలర్‌లను ఎత్తుకెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత సంవత్సరం గోపి అనే వ్యక్తికి చెందిన వాహనాన్ని, క్రిస్మస్ సెలవుల సమయంలో ధర్మన్న అనే వ్యక్తి వాహనాన్ని సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. ఇలా రెండు సంఘటనలు మరువకముందే మూడో ఘటన చోటు చేసుకుంది. కాగా పట్టుబడిన వారి ద్వారా సమాచారం సేకరించిన పోలీసులకు ముఠా సభ్యులతో పాటు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠా సభ్యులు ఇదే ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడ్డారా.. లేక ఇతర ప్రాంతాల్లోనూ దొంగతనం చేశారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

చలాన్ రాయడమే కాదు.. సేవ్ కూడా చేస్తాం



సుభాష్‌నగర్: నిత్యం రద్దీగా ఉండే షాపునగర్‌లోని గాజులరామారం చౌరస్తాలో మంగళవారం ఉదయం ఓ ద్విచక్ర వాహన దారుడు స్కిడ్ అయ్యి పడిపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది అతను కింద పడకుండా క్షణాల్లో పట్టుకున్నారు. దీంతో వాహనదారుడు క్షేమంగా బయటపడ్డారు. ఈ దృశ్యాలను ఓ వాహనదారుడు తన ఫోన్‌లో బంధించగా స్థానికులు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులపై ప్రశంస జల్లులు కురిపించారు.

మందుల దుకాణాల తనిఖీ

దుండిగల్: మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హేమలత మంగళవారం తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నారా.. అన్న అంశంపై ఆరా తీశారు. ఐదేళ్లకు ఒక సారి మెడికల్ షాపులను రెన్యూవల్ చేసుకుంటున్నారా? అన్న వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా స్థానికంగా క్లినిక్‌లు నిర్వహించే ఆర్‌ఎంపీ డాక్టర్లు రాసే మందులను సైతం పరిశీలించినట్లు తెలిసింది.

డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పాటు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి

నిజాంపేట్ : డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. 18వ డివిజన్ కావ్య ఎవెన్యూ కాలనీ, నందనవనం కాలనీలో మంగళవారం రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ అభ్యున్నతికి ఎల్లప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, ఆగం పాండు, ఎస్ఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజేందర్, సత్తిరెడ్డి, సీతారాంరెడ్డి, శంకర్, చౌదరీ, బాల్‌రెడ్డి, నాగరాజుయాదవ్, రాము, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



కుత్బుల్లాపూర్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ రవాణాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటలతో వాహనదారులను చైతన్యపరిచారు. ప్రధాన జంక్షన్ వద్ద రోడ్లను జాగ్రత్తగా దాటాలని, వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో జారిపడే ఆస్కారముందన్నారు. మద్యం మత్తులో, హెల్మెట్ లేకుండా వాహనాలు నడరాదని, కారులో సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీనివాస్, శిల్ప పాల్గొన్నారు.

వార్డు సభలు షురూ

- అర్హుల జాబితాను ప్రకటించిన అధికారులు
- జాబితాలో లేని అర్హుల నుంచి మళ్లీ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సత్యనారాయణ



ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డు సభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మొదటి రోజు ఏడు వార్డుల్లో సభలను నిర్వహించారు. సభల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్ కార్డులు, రైతు భరోసా జాబితాను చదివి వినిపించారు. కొత్తగా ఇందరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి 906 దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 24వ తేదీ వరకు వార్డు సభలను నిర్వహిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ లక్ష్మయ్య, రెవెన్యూ అధికారి ప్రభాకర్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి సంజన, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడంపై చైర్మన్ ఆగ్రహం

కుత్బుల్లాపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కొంపల్లి మున్సిపల్ పరిధిలో మంగళవారం చేపట్టిన వార్డు సభలు రసాభాసగా మారాయి. ఉదయం 10 గంటలకు కొంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ హాజరై సభను ప్రారంభించారు. అయితే అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక నాయకులను కూర్చోబెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభను వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు మొక్కుబడిగా సభలను నిర్వహిస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రేషన్ కార్డుల జారీ చేసే విషయంలో నిబంధనలు పెట్టడంపై విమర్శించారు.

- కొంపల్లి 1, 3, 5 వార్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదే విధంగా 2, 4, 6 వార్డులో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలను నిర్వహించాఆరు. కౌన్సిలర్లు శకుంతల, మంజుల, సువర్ణ, విద్య, వసంత, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ నగర్‌లో వార్డు సభ

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్ 191 ఎన్‌టీఆర్ నగర్‌లో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు సభను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్లు, స్థలం ఉన్న 8 మందికి రూ.5లక్షల ఆర్థిక సహాయం, అర్హులైన 184మంది నిరుపేదలకు రేషన్ కార్డులు, అదేవిధంగా 413 మందికి ఇందిరమ్మ ఇండ్లు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ప్రణయ, బాలాజీ నాయక్, మేనేజర్ జయరాజు, వార్డు ఆఫీసర్ పూర్ణిమ, సీనియర్ అసిస్టెంట్ కె.ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.